ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

మిగిలిన సరుకు ఎక్కడ?

- 70 శాతమే అమ్ముడైన దీపావళి బాణసంచా
- విక్రయం కాని సరుకును ఇళ్లకు తరలించిన దుకాణదారులు
- పట్టించుకోని అధికారులు



దీపాల కాంతులతో, బాణసంచా మోతలతో దీపావళి పండుగను జిల్లా వాసులు ఆనందంగా జరుపుకున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా అనుకున్న స్థాయిలో బాణసంచా అమ్ముడు కాలేదు. మిగిలిన సరుకు ఏమవుతోంది? వివిధ ప్రాంతాల్లోని తాత్కాలిక దుకాణదారులు ఎంత సరుకును తీసుకువస్తున్నారు? ఎంత అమ్ముతున్నారు? ఎంత మిగులుతోంది? మిగిలిని సరుకును ఎక్కడ దాస్తున్నారు? అనే వాటిపై అధికారుల నిఘా పూర్తిగా కరువైందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏటా మిగిలే సరుకును దుకాణదారులు తమ ఇళ్లలో నిల్వ చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వల్ల ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అసలు దుకాణాల ఏర్పాటు దగ్గరి నుంచి పండుగ ముగిసిన తర్వాతి తతంగం దాకా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



నంద్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో 73 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణదారు దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సరుకును తెచ్చినట్లు సమాచారం. ఏ దుకాణదారుడు ఎంత సరుకు తీసుకువచ్చిందీ ఎవరికీ తెలియదు. వాస్తవానికి దుకాణాలకు అనుమతులిచ్చిన తర్వాత సరుకును తీసుకురావాలి. కానీ దుకాణదారులంతా సరుకును ముందుగా తీసుకువచ్చిన తర్వాత అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బాణసంచా అమ్మే సమయంలో వినియోగదారులకు బిల్లులను ఇవ్వడం లేదు. తెల్లకాగితం మీద లేదా బాణసంచా అట్టలపైనే రాసి ఇస్తున్నారు. బిల్లులు ఉంటే దుకాణదారులు ఎంత సరుకు తీసుకువచ్చారు? ఎంత అమ్మకాలు జరిపారు? ఎంత మిగిలింది? అనే దానిపై ఓ స్పష్టత ఉంటుంది. అమ్మినదానిపైన ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ ఇలాంటి ఆధారాలేవీ ఉండటం లేదు.

● తనిఖీలు ఏవి..?

నంద్యాలలో ఏర్పాటు చేసిన దుకాణదారులంతా కలిసి దాదాపు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల రూపాయల సరుకు తీసుకువచ్చి ఉంటారు. ఇక మిగిలిన ముఖ్య పట్టణాలలో విక్రయానికి తీసుకువచ్చిన బాణసంచా విలువ రూ.10 కోట్ల పైనే ఉంటుంది. అయితే అమ్మకాలు మాత్రం 70శాతం మించి జరగలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇలా ప్రతి ఏటా దాదాపు 30 నుంచి 50 శాతం వరకు సరుకు మిగులుతున్నది. ఈ సరుకును దుకాణదారులు తిరిగి ఇవ్వడం లేదు. మిగిలిన బాణసంచాను అధికారుల నుంచి అనుమతి తీసుకుని, జనసంచారానికి దూరంగా నిల్వ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇలాంటి నిబంధనలు ఏమీ పాటించకుండా ఇళ్లలోనే ఉంచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● నిఘా లోపమేనా..?

దీపావళికి తాత్కాలిక దుకాణదారులు విక్రయించగా మిగిలిపోయిన సరుకును విక్రయదారులు ఇళ్ల మధ్యనే నిలువ చేసుకుని పెళ్లిళ్ల, చావుల వంటి వాటికి ఎక్కువ ధరలకు అమ్ముతుంటారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అధికారులు నిఘా లేకపోవడంతోనే ఇలా జరుగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా సరుకు మిగులుతున్నా.. ఆ సరుకు ఏమవుతోందన్న విషయంపై అధికారులు ఆరా తీసిన సంఘటనలు జిల్లాలో జరిగిన దాఖలాలు లేవు. దీంతో పాటు అనుమతులిచ్చే సమయంలో, రవాణా, క్రయవిక్రయాల లాంటి విషయాల్లో అధికారులు పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవన్న ఆరోపణలు గట్టిగానే వినిపించాయి.

● పట్టించుకోరా..?


దీపావళి సందర్భంగా నంద్యాలలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల అనుమతుల విషయంలో ఓ నేత చక్రం తిప్పాడన్న విమర్శలు గట్టిగా వినిపించాయి. దీనిపై దీపావళి వసూళ్ల అనే పేరిట ఆంధ్రజ్యోతి గత నెల 28న కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారుల్లో పెద్దగా చలనం కనిపించలేదు. అసలు తాత్కాలిక బాణసంచా దుకాణాల విషయంలో బయటి వ్యక్తులు ఎందుకు కల్పించుకుంటున్నారని అధికారులు కనీసం ఆరా తీయలేదు. ఇక దీపావళి ముందురోజు వరకు కూడా దుకాణాల అనుమతులు విషయంలో సందిగ్ధతకు తెర పడకపోవటంతో దుకాణదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయితే వారంతట వారే మధ్యవర్తికి డబ్బులు ఇచ్చి ఇరుక్కుపోవటంతో ఎవరిని ప్రశ్నించలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. కానీ నిబంధనలను కచ్చితంగా అమలు పరచాల్సిన అధికారులు ఎందుకు కఠినంగా వ్యవహరించలేకపోయారన్నది అంతుచిక్కని ప్రశ్న. మొత్తానికి దీపావళి తాత్కాలిక దుకాణాలకు సంబంధించి వసూళ్లను చేపట్టిన నాయకుడికి అధికారులు పరోక్షంగా సహకరించారన్న విమర్శలు వినిపించాయి.

తెల్లారిన బతుకులు

- దైవ దర్శనానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు
- మంత్రాలయం హైవే వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొన్న కారు
- ముగ్గురు మహిళలు దుర్మరణం
- ఇద్దరు చిన్నారులు, ఆటో డ్రైవర్‌కు గాయాలు
- కొన ఊపిరితో ఉన్న భార్యను చూసి రోదనలు

వివరాలు 7లో

ముందురోజు అమావాస్య కావడంతో ఇష్టదైవాన్ని ప్రార్థించుకుని రోజంతా దైవ సన్నిధిలోనే గడిపారు. అమావాస్య ఘడియలు ముగియగానే సొంతూర్లకు వెళ్లి పనులు చేసుకోవాల్సిన వారు అనంతలోకాలకు చేరిపోయారు. మరికొద్ది సేపట్లో గమ్యస్థానానికి చేరుతామనుకున్న బతుకులు అంతలోనే తెల్లారిపోయాయి. తెల్లవారుజామున ఆటోలో ప్రయాణిస్తున్న తమను మృత్యువు కారు రూపంలో కబళిస్తుందని వారు ఊహించలేకపోయారు. ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృత్యుఒడిలోకి జారిపోయారు. భర్త ఎదుటే భార్య ప్రాణాలు కోల్పోవడం అందరినీ కంటతడి పెట్టించింది. ఆ సంఘటనను చూసిన ప్రతిఒక్కరూ చలించిపోయారు. అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొనడంతో ముగ్గురు మహిళలు మృతిచెందిన సంఘటన నందవరం మండలం ధర్మాపురం టోల్‌ప్లాజా సమీపంలో హైవేపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.



ముల్లా బీబీ (ఫైల్)



కురువ వీరనాగమ్మ(ఫైల్)



కురువ గౌరమ్మ(ఫైల్)



దూరాన బిడ్డలు.. ఒడిలో భార్య

ఎంతో ఆనందంతో తల్లిదండ్రులతో కలిసి సొంత ఆటోలో ఆడుతూ.. పాడుతూ స్వగ్రామానికి బయల్దేరిన ఆ చిన్నారులకు తెలియదు తల్లిప్రేమకు దూరమవుతున్నామని. వారు ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొనడంతో చిన్నారుల తల్లి బీబీ తీవ్రంగా గాయపడి మృతి చెందగా ఆ చిన్నారులు సైతం రక్తగాలపాలై స్పృహ కోల్పోయారు. తమ తల్లి ప్రమాదంలో మృతి చెందిందన్న విషయం ఆ చిన్నారులకు తెలియకపోవడం కలిచివేసింది. ఓ వైపు కొన ఊపిరితో ఉన్న భార్య.. మరో వైపు ఇద్దరు బిడ్డలు స్పృహ కోల్పోవడం, తీవ్ర గాయాలపాలైన గని బాషా ఆవేదన అందర్నీ కలచివేసింది. చనిపోయేముందు భార్యను ఒడిలోకి తీసుకుని దూరాన పడి ఉన్న బిడ్డలను చూస్తూ ఆయన చేసిన రోదన వర్ణనాతీతం. నాకు, నా బిడ్డలకు దిక్కెవరు అంటూ ఆయన బోరున విలపించాడు.



ఆలయ అభివృద్ధికి నిధులు

-మంత్రి ఎన్ఎండీ ఫరూక్



ప్రథమ నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న మంత్రి, కలెక్టర్

నంద్యాల కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు దేవదాయ శాఖ మంత్రితో మాట్లాడి తగినన్ని నిధులు విడుదల చేయిస్తానని మంత్రి ఫరూక్ తెలిపారు. శనివారం కార్తీకమాసం సందర్భంగా ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానంలో మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ప్రథమ నందీశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రామచంద్రరావు, రాజారం, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. అట్లాగే అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

నడిరోడ్డుపై అమ్మ

- అర్ధరాత్రి నడివీధిలో వదిలేసిన కొడుకు
- పత్తికొండలో అమానవీయ ఘటన



కుమారుడు రోడ్డుపై వదిలిపోవడంతో దీనంగా కూర్చున్న వృద్ధురాలు తిరుపతమ్మ

నవమాసాలు మోసి కని పెంచిన తల్లి అవసాన దశలో బరువైంది. పసిబిడ్డగా ఉన్నప్పుడు చనుబాలతో కడుపు నింపిన తల్లిని వదిలించుకున్నాడు కన్నకొడుకు. జోలపాట పాడి ఊయలూపిన అమ్మను కర్కశంగా రోడ్డుపై వదిలేశాడు. వృద్ధాప్యంలో కన్నబిడ్డ బాగా చూసుకుంటాడనుకున్న ఆ తల్లి జీవితం తారుమారైంది. ఆ కొడుకు, కోడలే ఆమెను వద్ద నుకున్నారు. ఆ పండుటాకుని భారంగా భావించారు. ఇంట్లో నుంచి తరిమేసి నడిరోడ్డుపాలు చేశారు. మానవత్వాన్ని మంటగలిపే ఈ ఘటన పత్తికొండ పట్టణంలో శనివారం చోటు చేసుకుంది.

వివరాలు 6లో...

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేస్తాం

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్యాపిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం మండలంలో వాల్మీకి గుహల దగ్గర కర్ణాటక వాల్మీకి గురుపీఠం ప్రసన్నానందపురి మహాస్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో డోన్, ఆదోని ఎమ్మెల్యేలు కోట్ల ప్రకాష్‌రెడ్డి, పార్థసారథితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోని రావడానికి వాల్మీకుల పాత్ర ఉందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడుతానన్నారు. కేంద్ర నిధులతో వాల్మీకి గుహలను మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, కేశ రుద్రఫణిగౌడు, వలసల రామక్రిష్ణ, వడ్డె మహరాజ్, మాజీ ఎంపీపీ సరస్వతి, డాక్టర్ భవానీ ప్రసాద్, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసులు, న్యాయవాది భాస్కర్ నాయుడు, మద్దులేటి, కంబయ్య, కంబగిరిస్వామి పాల్గొన్నారు.



వాల్మీకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

పనులు చేయకుండా ప్రజాధనం స్వాహా

- రూ.10 కోట్లకు పైగా స్వాహా
- వైసీపీ ప్రభుత్వంలో నాటి ఇంజనీరింగ్ అధికారుల భాగోతం
- నీరు-చెట్టు కింద చేయని పనులకు బిల్లులు
- జలవనరుల శాఖలో భారీ కుంభకోణం
- గతంలో పని చేసిన ఇంజనీర్లకు కోర్టు నోటీసులు రావడంతో వెలుగులోకి

కర్నూలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ నీరు-చెట్టు పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకం అమలులో అవినీతి జరిగిందని బిల్లులు ఆపేసింది. కాంట్రాక్టర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు కొంత వరకు బిల్లులు చెల్లించారు. ఇదే అవకాశంగా తీసుకున్న ఇంజనీరింగ్ అధికారులు కొందరు అప్పటి అధికార పార్టీ అండదండలు ఉన్న కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నీరు-చెట్టు కింద పనులు చేయకుండానే ప్రజాధనం మింగేశారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.10 కోట్లకు పైగా ప్రజాధనం స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా మండలాల్లో గతంలో పని చేసిన మండల స్థాయి ఇంజనీర్లకు కోర్టు నోటీసులు రావడంతో అవినీతి భాగోతం బయటకు పొక్కింది. కర్నూలు జలవనరుల శాఖలో వెలుగు చూసిన భారీ కుంభకోణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కోసం పలువురు డిమాండ్ చేస్తున్నారు.



జంగిల్ క్లియరెన్స్ చేయకుండానే నిధులు డ్రా జరిగిన ముల్లవాగు ఇదే

మిగతా 6లో...

రహదారులకు మహర్దశ

మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంతో మరమ్మతులు

నంద్యాల జిల్లాలో రూ.4.39 కోట్లతో 359 కి.మీ మేర పనులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలన లో రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఛిద్రమైన ర హదారులే దర్శనమిచ్చాయి. ఆ రహదా రుల్లో వెళ్లేందుకు వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తిపోయారు. జిల్లాలోని పలు ఆర్‌అండ్‌బీ రహదారులు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారా యి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించిన టీడీపీ.. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రహదా రుల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ(గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంతో రహదారులకు మరమ్మతులు చేపట్టే బృ హత్తర ప్రణాళికతో పనులు ప్రారంభిం చారు.

నంద్యాల జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారులను అధికారులు గుర్తించి తయారు చేసిన నివేదికల ఆధారంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా మొదటి విడతలో జి ల్లాలో రూ.4.39 కోట్లతో 359 కిలోమీటర్ల మేర రహదారుల్లోని గుంతలను పూడ్చ డం, ముళ్లపొదలను తొలగించేందుకు ప నులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికీ ఈ పనులన్నింటి నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులకు దిశానిర్దేశం చేసింది. రెండో విడతలో జిల్లాలోని మరిన్ని రహదారుల్లో మరమ్మతులకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. అలాగే దెబ్బతిన్న కల్వర్టులకు వంతెన నిర్మాణాలను మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు.



శిరివెళ్ల మెట్ట నుంచి యాళ్లూరు వెళ్లే ప్రధాన రహదారి

శ్రీగిరిపై కార్తీక శోభ



గంగాధర మండపం వద్ద కార్తీక దీపాలు



- భారీగా తరలివచ్చిన భక్తులు
- పాతాళగంగలో పుణ్యస్నానాలు
- ఆకట్టుకున్న ఆకాశదీపం



శ్రీశైలం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో శనివారం కార్తీక ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం మొదటిరోజును పురస్కరించుకుని క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం వేకువజాము నుంచే వందల సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. వేకువజామున 3 గంటలకు ఆలయద్వారాలు తెరచి, ప్రాతఃకాల పూజలు జరిపారు. అనంతరం ఉదయం 4:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5:30 నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్ల దర్శనాలు కొనసాగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద మహిళలు దీపారాధనలను చేశారు. అదేవిధంగా కొంత మంది భక్తులు లక్ష వత్తుల నోములను నోచుకున్నారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం మంచినీళ్ళు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజన కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ఆకాశ దీపం

కార్తీకమాసోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి విశేష పూజలు చేసి, దీపప్రజ్వలన, దీపారాధనలను జరిపారు.



పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ



ఆకాశదీపం



కళాకారుల నృత్యం

ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి

- ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి



సూపరింటెండెంట్‌ను కలిసిన ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సమస్యలను పరిష్కరించాలని, రోగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లును కోరారు. శనివారం కొత్తగా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును వెంగళ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఔషధశాల రేకుల షెడ్డులో ఉండటం వల్ల చిన్న పిల్లలు, గర్భిణులకు చెందిన మందులు చెడిపోతున్నాయని, ఎలుకల బెడద అధికంగా ఉందని చెప్పారు. ఔషధశాలను తక్షణమే మార్చి రోగులకు దగ్గర ఉండే క్యాజువాల్టీ సమీపంలో మార్చాలని కోరారు. నర్సింగ్ సిబ్బందికి వాష్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని, నర్సెస్ అసోసియేషన్ భవనానికి మరమ్మతులు చేయించాలని కోరారు. మినిస్టీరియల్, పారామెడికల్ సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ దస్తగిరిరెడ్డి, కర్నూలు సిటీ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఏపీ జేఏసీ కో చైర్మన్ మద్దిలేటి, ఏపీ ఫార్మాసిస్టు అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు రంగస్వామి, సత్యప్రకాష్, వలి, ఏపీ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. లీలావతి, సి.బంగారి, కోశాధికారి ఎన్. లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులు ఎస్.సోమేశ్వరి, శాంతిలత, జే. ఉమారాణి, రామతులసి పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌పై అవగాహన కల్పించాలి

- మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల



మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగశివలీల

కర్నూలు న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పొదుపు సంఘాల సభ్యులకు సంబంధించి నిర్దిష్టమైన డేటా సేకరణ కోసం రూపొందించిన ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌పై అవగాహన కల్పించాలని మెప్మా పీడీ నాగశివలీల సూచించారు. శనివారం ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలకు సంబంధించి ఆర్‌పీలు, సిబ్బందికి ఎస్‌హెచ్‌జీపై శిక్షణ కల్పించారు. అధికారి మాట్లాడుతూ ఈ యాప్‌లో ప్రతి ఆర్‌పీ తన పరిధిలోని అన్ని సంఘాల వివరాలను సేకరించాలన్నారు. ఈ విధానమైన డేటా వల్ల క్షేత్రస్థాయిలో డూప్లికేషన్‌కు తావు ఉండకూదన్నారు. కార్యక్రమంలో టీపీఆర్వో వెంకటలక్ష్మి, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆసిఫ్‌బాషా, ఏవో భాస్కర్‌రెడ్డి, సిటీ మిషన్ మేనేజర్ సుధాకర్, భారతి, టీఎంసీలు, అన్ని మున్సిపాలిటీల సిబ్బంది పాల్గొన్నారు.

నడిరోడ్డుపై అమ్మ

(5వ పేజీ తరువాయి)

- చలిలో బిక్కుబిక్కుమంటూ వృద్ధురాలు
- తల్లిని తీసుకెళ్లని కుమార్తె, అల్లుడు
- అవసాన దశలో అమ్మకు అవస్థలు

పత్తికొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయం. పత్తికొండ పట్టణం ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలోని ఓ కాలనీలో నడవలేని స్థితిలో ఉన్న 75 ఏళ్ల వృద్ధురాలు ప్లాస్టిక్ కుర్చీపై చలికి వణికిపోతూ బిక్కుబిక్కుమంటూ కూర్చొని ఉంది. కనీసం లేచి అడుగు తీసి అడుగు కూడా వేయలేని పరిస్థితి ఆమెది. వీధిలో వాళ్లు 'ఏం అవ్వా.. ఎవరు నువ్వు ఇక్కడ కూర్చున్నావు..' అంటూ అడిగే సరికి కళ్లలో నీళ్లు తిరిగే సమాధానమిచ్చింది ఆ వృద్ధురాలు. 'అర్ధరాత్రి నా కొడుకు ఆటోలో తీసుకొచ్చి ఈడ వదిలేసి పోయినాడమ్మా. అరవలేను. పిలవలేను. నడవలేను తల్లీ కాసిన్ని నీళ్లు ఇవ్వండమ్మా..' అంటూ కన్నీటి సుడులతో ఆ వృద్ధురాలి నుంచి పొడిపొడిగా వచ్చిన మాటలివి. వివరాల్లోకెళ్తే... అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన తిరుపతమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు శ్రీనివాసులు గుంతకల్లులో ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. పెద్దకుమార్తె పత్తికొండలో, చిన్న కుమార్తె బళ్లారిలో ఉంటున్నారు. ఎవరికీ భారం కాకూడదని భావించిన తిరుపతమ్మ బళ్లారిసమీపంలో ఓ వృద్ధాశ్రమంలో చేరి తనకు వచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవించేది. ఇటీవల కిందపడి గాయపడిన ఆమె మంచంపాలైంది. దీంతో చిన్నకూతురు, కుమారుడు ఖర్చులు భరించి ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ తర్వాత గుంతకల్లులో కొడుకు ఇంటివద్దే తిరుపతమ్మ ఉంటోంది. ఈ క్రమంలో భారమైన తల్లిని కుమార్తె వద్దకు వెళ్లాలంటూ కొడుకు శ్రీనివాసులు తిరుపతమ్మను గుంతకల్లు నుంచి పత్తికొండకు అర్ధరాత్రి ఆటోలో తీసుకొచ్చాడు. ఓ ఇంటి ఎదుట ప్లాస్టిక్ కుర్చీలో తల్లిని కూర్చోబెట్టి.. 'ఇదే నీ పెద్ద కూతురు ఇల్లు. తెల్లవారి వాళ్లు నిద్రలేచాక నిన్ను ఇంట్లోకి తీసుకెళ్తారు..' అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో రాత్రంగా చలిలో వణుకుతూ బిక్కుబిక్కుమంటూ అక్కడే ఉండిపోయింది. ఉదయం కాలనీ వాసులు వృద్ధురాలికి సపర్యలు చేసి అల్పాహారం తినిపించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జయన్న అక్కడకు చేరుకుని వృద్ధురాలు తిరుపతమ్మ వద్ద వివరాలు సేకరించారు. పక్క వీధిలోనే ఉన్న కుమార్తె, అల్లుడికి సమాచారం ఇచ్చి పిలిపించి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే తల్లిని తన ఇంటికి తీసుకెళ్లేందుకు కుమార్తె నిరాకరించింది. కుమారుడు శ్రీనివాసులుకు పోలీసులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తోంది. తల్లిని ఆదరించాల్సిన కొడుకు అర్ధరాత్రి నడిరోడ్డుపై తల్లిని వదిలేయడం, కుమార్తె ఇంటికి తీసుకెళ్లేందుకు ససేమీరా అనడంతో ఆ వృద్ధురాలిని 108 అంబులెన్స్‌లో పోలీసులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు, ఇద్దరు కుమార్తెలను పిలిపించి విచారిస్తామని సీఐ జయన్న తెలిపారు. ఆమెకు ఆశ్రయం కల్పించేలా చూస్తామని తెలిపారు.



తిరుపతమ్మ నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న సీఐ జయన్న

పనులు చేయకుండా ప్రజాధనం మింగేశారు..!



(5వ పేజీ తరువాయి)

జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలోకి తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) డివిజన్, కేసీ కెనాల్ నంద్యాల డివిజన్, ప్రొటెక్షన్ వర్క్ డివిజన్, మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) కర్నూలు, నంద్యాల డివిజన్లు ఉన్నాయి. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం భూగర్భ జలాలు పెంపు, నీటి వనరుల సంరక్షణ లక్ష్యంగా 2024-25 నుంచి 2018-19 వరకు నీరు-చెట్టు పథకం ప్రతిష్టాత్మంగా అమలు చేశారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఆయా డివిజన్లలో దాదాపు రూ.1,585.70 కోట్లు విలువైన పనులు చేపట్టారు. అందులో రూ.580 కోట్లకు పైగా ఖర్చు చేశారు. చెక్ డ్యాంలు నిర్మాణం, చెరువులు, వంకలు, వాగులు, కాలువల్లో పూడికతీత (డీసిల్టింగ్), జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లలో రూ.1,447 కోట్లకుపైగా విలువైన పనులు చేపట్టి రూ.468 కోట్లు ఖర్చు చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే.. 2019 మేలో వైసీపీ ప్రభుత్వం రాగానే నీరు-చెట్టు పనుల్లో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు బూచి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లింపులు ఆపేయడమే కాకుండా బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకుండా హెడ్ ఆఫ్ అకౌంట్‌ను క్లోజ్ చేసిందని పేర్కొన్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లు న్యాయస్థానం ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల గత వైసీపీ ప్రభుత్వంలో కొంత వరకు బిల్లులు చెల్లింపునకు శ్రీకారం చుట్టడంతో బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు హెడ్ ఆఫ్ అకౌంట్ ఓపన్ చేశారు. ఇదే అదనుగా భావించి నాటి అధికార వైసీపీ ముఖ్య నాయకుల అండదండలు కలిగిన జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు కొందరు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి నీరు-చెట్టు కింద చేయని పనులకు ఎంబుక్ రికార్డులు చేసి బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ప్రజాధనం మింగేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 12న కొలుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం నీరు-చెట్టు బిల్లులు చెల్లింపులు మరోసారి హెడ్ ఆఫ్ అకౌంట్ ఓపన్ చేశారు. అయితే.. కోర్టులో డబ్ల్యూపీ, కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులు ఉన్న బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేయాలని నిబంధనలు పెట్టినా ఇష్టారాజ్యంగా చేయని పనుల బిల్లులు కూడా అప్‌లోడ్ చేసి దాదాపు రూ.10 కోట్లకు పైగా నీరు-చెట్టు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పిన కీలక అధికారి పాత్ర ఇందులో ఉందని జలవనరుల శాఖలో ప్రధానంగా చర్చ జరుగుతున్నది.

ఇలా వెలుగులోకి వచ్చింది..

మైనర్ ఇరిగేషన్ విభాగంలో ఓ మండలంలో పని చేసిన ఇంజనీరు ఒకరు 2022లో మరో డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. ఆ సమయానికి నీరు-చెట్టుకు సంబంధించిన మూడు బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఆ రికార్డులను అప్పగించి రిలీవ్ అయ్యారు. కట్ చేస్తే.. రెండేళ్ల తరువాత వారం పది రోజుల క్రితం ఫలానా కాంట్రాక్టరు చేసిన పనులకు ఎందుకు బిల్లులు చెల్లించలేదో సమాధానం ఇవ్వాలని కోర్టు నుంచి నోటీస్ వచ్చింది. అసలు ఆ పనే చేయలేదు.. బిల్లులు చెల్లించాలని కోర్టు నోటీస్ ఇవ్వడమేమిటి..? అని విచారిస్తే.. తన ప్రమేయం లేకుండానే ఫోర్జరీ డాక్యుమెంట్లతో చేయని పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసి బిల్లులు స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఆ మండలంలో ఒక్కటే కాదు.. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో డోన్, బేతంచర్ల, వెల్దుర్తి, కృష్ణగిరి, ఆస్పరి, గోనేగండ్ల, ఆదోని మండలాల్లో మైనర్ ఇరిగేషన్ విభాగంలో నీరు-చెట్టు కింద మంజూరై.. గంపెడు మట్టి కూడా తీయని పనులు గుర్తించి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి బిల్లులు అప్‌లోడ్ చేసి వందకు పైగా పనులకు సంబంధించి సుమారుగా రూ.10 కోట్లకుపైగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అత్యధికంగా డోన్, బేతంచర్ల మండలాల్లో అక్రమాలు జరిగితే.. ఆ తరువాత స్థానాల్లో గోనెగండ్ల, ఆస్పరి, ఆదోని మండలాలు ఉన్నాయని సమాచారం. చేయని పనులకే కాదు.. గతంలో బిల్లులు తీసుకున్న పనులకు కూడా రెండోసారి ఫోర్జరీ సంతకాలతో బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

విజిలెన్స్ విచారణ చేస్తే భారీ కుంభకోణం: జిల్లాలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్‌లోడ్ చేసిన నీరు-చెట్టు బిల్లులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేస్తే పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేసిన భారీ కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అయితే.. ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో అవినీతి అధికారుల్లో దడ మొదలైంది.

విచారణ చేస్తున్నాం

నీరు-చెట్టు పనుల్లో చేయని పనులకు కూడా బిల్లులు పెట్టి నిధులు డ్రా చేశారనే ఆరోపణలు వచ్చిన మాట నిజమే. దీనిపై విచారించి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తాం.

- బి. బాలచంద్రారెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం: ఆర్డీవో



మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడ శిశువులను గర్భంలోనే తుడిచివేయడం చట్టరీత్యా నేరమని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశం ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఆడ శిశువులను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కొత్త స్కానింగ్ కేంద్రాలు, కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీల రిపోర్టులను పీసీపీఎన్‌డీటీ జిల్లా స్థాయి కమిటీకి సమర్పించి ఆమోదం పొందాలన్నారు. జూనియర్ కళాశాలలు, హైస్కూల్, పాఠశాలల్లో ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన పెంచాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ గురించి ఎవరికి మాటల ద్వారా గానీ, సైగల రూపంలో గానీ, చేతుల రూపంలో గానీ చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ జిల్లా నోడల్ ఆఫీసర్ డీఐవో డా.నాగప్రసాద్, గైనకాలజిస్టు డా.సంధ్య, డెమో శ్రీనివాసులు, ఎస్ఐ సోమశేఖర్, డివిజనల్ పీఆర్వో శివకుమార్ యాదవ్, ఎన్జీవోలు రాయపాటి శ్రీనివాసులు, మద్దిలేటి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

9న నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న హరినాథగుప్త

నంద్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 9న కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథగుప్త తెలిపారు. శనివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కళాశాల 1960లో స్థాపితమైందన్నారు. మొదటి బ్యాచ్ 1963నుంచి ప్రస్తుత విద్యాసంవత్సరం వరకు అన్ని బ్యాచ్‌లను కలుపుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకొని విద్యనభ్యసించిన కళాశాల అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని కొనియాడారు. రూ.30లక్షలు పూర్వ విద్యార్థుల నుంచి నిధులు సేకరించి కళాశాలలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, మౌలిక వసతులను అన్ని హంగులతో ఏర్పాటు చేశారన్నారు. 9వ తేదీన జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అవుకు, ఆదోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, అధ్యాపకుడు రఘునాథరెడ్డి, ఉమామహేశ్వరప్ప, కళాశాల సెక్షన్ హెచ్‌ఓడి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.50 లక్షల ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ', 'రోపా - కర్నూలు" వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపిన 160 మంది పేద విద్యార్థులకు రూ.7.50 లక్షల ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ. 3 లక్షల 75వేలు తులసీ సీడ్స్ వారు, కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నారు. కర్నూలులోని రావూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

కొణిదెలలో కొండచిలువ



నందికొట్కూరు రూరల్ అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామంలో ఇళ్ళ మధ్యకు కొండ చిలువ వచ్చింది. శనివారంనందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామంలో బస్టాండ్ వద్ద గల కట్టెల డిపో వద్ద గొల్ల నాగశేషులు, బషీర్, దౌలత్ ఇళ్ల వద్ద కొండచిలువ కనిపించింది. దీంతో స్థానికులు భయాం దోళనకు గురయ్యారు. ఎఫ్‌డీఆర్వో తాహేర్ స్నేక్ క్యాచర్ రామును పిలిపించి కొండచిలువను పట్టించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తెల్లారిన బతుకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి


ఆటో నుంచి కిందపడిన చిన్నారి


ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో రోదిస్తున్న బంధువులు

5వ పేజీ తరువాయి

ఎమ్మిగనూరు/నందవరం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణానికి చెందిన ముల్లా గనిబాషా అతడి భార్య ముల్లా బీబీ(32), ఇద్దరు పిల్లలు నజియా, ఖాజావలి అమావాస్య కావడంతో సొంత ఆటో తీసుకొని ఆదోని సమీప లోని సుల్తానా పురంలో ఉన్న దర్గాలో రాత్రి నిద్రచేసేందుకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున స్వగ్రామమైన మంత్రాలయానికి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. అదేవిధంగా నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన గౌరమ్మ(60), కురువ వీర నాగమ్మ(65) మండల కేంద్రమైన నందవరంలో ఉన్న బీరప్పస్వామి దేవాల యంలో అమావాస్య రోజు రాత్రి నిద్రచేసి తిరిగి స్వగ్రామమైన హాలహర్వికి ప్రయాణ మయ్యారు. నందవరం నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఆటోలో వచ్చి ముగతి క్రాస్ రోడ్డు దగ్గర దిగి మంత్రా లయానికి వెళ్తున్న గనిబాషా ఆటోలో హాలహర్వికి బయల్దేరారు.

ఆటో బయల్దేరిన కొన్ని నిమిషాలకే బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్తున్న కారు(కె.ఏ05 ఏఎం4196) అతివేగంగా ఆటోను వెనుక నుంచి ఓవర్‌టేక్ చేసేందుకు వెళ్తు ఢీకొట్టింది. ఒక్కసారిగా రోడ్డుపైనుంచి ఆటో పక్కనున్న పొలాల్లోకి ఎగిరిపడింది. కారు సైతం పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న హాలహర్వికి చెందిన వీరనాగమ్మ, మంత్రాలయానికి చెందిన ముల్లాబీబీ(32) తీవ్ర గాయాలపాలుకాగా వీరనాగమ్మ అక్కడిక్కడే దుర్మరణం పాలైంది. ముల్లా బీబీని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. అదేవిధంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న గౌరమ్మను అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని తిరిగి ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. ఆటో నడుపుతున్న ముల్లాగని బాషా కాలుకు తీవ్రగాయాలుకాగా చిన్నారులు నబియా, ఖాజావలిలకు రక్తగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సురక్షితంగా బెంగళూరు వాసులు

బెంగళూరు నుంచి దైవ దర్శనం కోసం మంత్రాలయానికి వస్తూ ప్రమాదానికి గురైన బెంగళూరువాసులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటక వాసులు నలుగురు కారులో శుక్రవారం రాత్రి మంత్రాలయానికి బయల్దేరారు. శనివారం ఉదయం మంత్రాలయం హైవేలోని ధర్మాపురం టోల్‌గేటు సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటోను క్రాస్‌చేయబోయి అతివేగంగా కారుతో ఢీకొట్టారు. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్ మహేశ్‌తో పాటు, యజమానిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆసుపత్రిలో మిన్నంటిన రోదనలు

ప్రమాద ఘటన సమాచారం తెలుసుకున్న మృతుల బంధువులు పెద్ద ఎత్తున ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. తమ బంధువులు మృతి చెందారన్న విషయం తెలుసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. ఆసుపత్రి ప్రాంగణం మృతుల బంధువుల రోదనలతో మిన్నంటింది. వ్యవసాయకూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న హాలహర్వి గ్రామానికి చెందిన వీరనాగమ్మ, గౌరమ్మ ప్రమాదంలో మృతి చెందటంతో హాలహర్విలో ఒక్క సారిగా విషాదచాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐ విక్రమసింహ, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాసుపత్రిలో ఆక్సిజన్ లీకేజీ


ఆక్సిజన్ లీకేజీని పరిశీలిస్తున్న రామశివనాయక్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లోని చిన్న పిల్లల విభాగం వద్ద గత రెండు రోజులుగా పైపుల నుంచి ఆక్సిజన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. లీకేజీ వల్ల పెద్దగా శబ్దం వస్తోందని రోగులు ఫిర్యాదు చేశారు. ఆక్సిజన్ లీకేజీ అవుతుండటంతో ప్రజల సొమ్ము వృథా అవుతుందని కొందరు విమ ర్శిస్తున్నారు. ఆసుపత్రి సూపరిం టెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డా. బీవీ రావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళినితో సమీక్ష నిర్వహించారు. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.రామశివనాయక్, లీకేజీని పరిశీలించి నివేదిక అందజేశారు.

'కోర్టు కానిస్టేబుళ్లు చిత్తశుద్ధితో పనిచేయాలి'

నంద్యాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేసుల నిరూపణలో చిత్తశుద్ధితో పనిచే యాలని పోలీస్ అధికారులు సూచించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని వివిధ కోర్టుల కానిస్టేబు ళ్లు, కోర్టు మానిటరింగ్ సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు మానిటరింగ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరయ్య సమావేశం నిర్వహిం చారు. కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టం అధికార సిబ్బంది కేసు నమోదు చేయడం, నిందితులను అరెస్ట్ చేయడం, చార్జిషీట్ వేయడం ఒక ప్రక్రియ అయితే కోర్టులో విధివిధానాలు సరిగా పాటించి కేసులను నిరూపణ చేయడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. నాన్‌బె యిలబుల్ వారెంట్స్ పెండింగ్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సర్వ్ చేయాలన్నారు. పాత పెండింగ్ కేసులపై శ్రద్ధ చూపి వారెంట్ సర్వ్‌చేయాలని, పోలీసుల అలసత్వంవల్ల కోర్టుల్లో విచారణ పెండింగ్ లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కేసుల విచారణ సమయంలో సాక్షులు, సాక్ష్యా. దారాలు, రికార్డులను కోర్టు కానిస్టేబుళ్లు కోర్టుల్లో పొందుపరచాలని సూచించారు.

చెరువులను నింపడంలో విఫలం

- వరద నీరంతా సముద్రంలోకే
- రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలి
- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు


సమావేశంలో పాల్గొన్న సభ్యులు, ఇన్‌సెట్‌లో చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని జలాశయాల్లో నీటి మట్టం పెరిగినా.. చెరువులను నింపడంలో అధికారులు ఘోరంగా విఫలం చెందారని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు చొరవ తీసుకుని అన్ని చెరువులను నింపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ మినీ సమావేశం భవ నంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి. నాసరరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శ్రీశైలం, సాగర్, కృష్ణా బ్యారేజీల్లో పూర్తి స్థాయి నీటి మట్టం ఉందన్నారు. అయినా జిల్లాలోని చెరువులను నింపలేక పోవడం దారుణమన్నారు. గ్రామాలలో వీధిలైట్లు 24 గంటలు వెలుగుతున్నాయని, నీరు వృథాగా పోతోందని, వీటిని పర్యవే క్షించాలని అన్నారు. ఆగస్టు 15న ఫోన్ చేసే వరకు విత్తనాలు పంపిణీ చేయకపోవ డంపై వ్యవసాయ అధికారిపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకే ఒక్క తీర్మానం..

దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం నిర్వహించే సదరం క్యాంపు గురించి సమావేశంలో చర్చ జరిగింది. పలువురు జడ్పీటీసీలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాల్లో సదరం క్యాంపు నిర్వహించేలా ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపాలని సమావేశం లో తీర్మానం చేశారు. డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు దివ్య సుధా కర్‌రెడ్డి, సుంకన్న, పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీటీసీలు ఏమన్నారంటే...

తమ ప్రభుత్వ హయాంలో మండలాలకు అభివృద్ధి నిధులు మంజూరు కాలేదని, కూటమి ప్రభుత్వమైనా నిధులు ఇచ్చి ఆదుకోవాలని వైసీపీకి చెందిన జడ్పీటీసీలు అన్నారు. సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీలు మాట్లాడుతూ పాఠశాలల్లో వంట చేసే కార్మికులను బదిలీ చేయరాదన్నారు. కొత్తపల్లి మండలంలో ఫీల్డు అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పని చేయడం లేదని, అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆవేదన చెందారు.

మనుషుల ప్రాణాలు పోతున్నాయి



నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు రోడ్డు పనులు నత్తనడకన సాగుతు న్నాయి. నంద్యాల చెక్‌పోస్టు నుంచి 2 కి.మీ రోడ్ల విస్తరణ పనులు చేపట్టకపోవడంతో మనుషుల ప్రాణాలు పోతున్నాయి. మొదట్లో 120 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. అయితే నగర పాలక అధికారులు కేవలం 100 అడుగులు మాత్రమే రోడ్ల విస్తరణ చేపట్టాలని అంటున్నారు. ఇందులో ఏది నిజమో తేల్చిచెప్పాలి.

- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే

సంక్షేమ హాస్టళ్లలో అవకతవకలు జరుగుతున్నాయి



ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అవకతవకలు జరుగుతున్నాయి. విద్యార్థులకు వసతుల విషయంలో రాజీప డవద్దు. కొందరు అధికారులు సరిగ్గా విధులు నిర్వహించడం లేదు. వచ్చే సమావేశంలో వారి వివరాలను తీసుకుని వస్తాను. 2018-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలు ప్రారంభమ య్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలు ఆగిపోయాయి. అవి ఏ దశలో ఉన్నాయో పూర్తి వివరాల ఇవ్వాలి.

- గిత్తా జయసూర్య, నందికొట్కూరు ఎమ్మెల్యే

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి



నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి. గదులు నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నాడు-నేడు కింద బడ్జెట్ ఉంటే పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలి. కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. గూడూరు ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు న్నాయి. కొత్త పీహెచ్‌సీ భవనాలను వేగంగా పూర్తి చేయాలి. కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కోసం బయటికి పంపిస్తున్నారు దీనిపై విచారణ చేపట్టాలి.

- బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి : నాగరాజు, ఎంపీ



కర్నూలు పార్లమెంటు పరిధిలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. పశ్చిమ ప్రాంతంలో వలసలను నివారించడానికి అందరినీ విద్యావంతులను చేయాలి. పాఠశాలల్లో వసతులు కల్పించాలి. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలు మరికొన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కోసిగి మోడల్ పాఠశాలలో ఫ్లోర్ శిథిలావస్థకు చేరింది. ఆలూరు ప్రసూతి కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి.

త్రీమెన్ కమిటీ ఎక్కడ..?

- మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేయని అధికారులు
- ఏజెన్సీల మార్పు కోసం హెచ్‌ఎంలపై పెరుగుతున్న ఒత్తిడి
- ఆలూరు మోడల్ స్కూల్‌లో పోటీ పడ్డ రెండు గ్రూప్‌లు


ఆలూరు మోడల్ స్కూల్‌లో వంట చేస్తున్న నిర్వాహకులు

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ కరువైంది.. త్రీమెన్ కమిటీ సభ్యులైన తహసీల్దార్, ఎంఈవో, ఎంపీడీవో స్కూళ్లను తనిఖీ చేసి పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో మధ్యాహ్న భోజనం తీరు కొన్ని పాఠశాలల్లో అధ్వానంగా మారింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన ఏజెన్సీలను తమకు ఇవ్వాలంటూ టీడీపీ నాయకులు పట్టుబ డుతున్నారు. ఈ మేరకు హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు.. జిల్లాలో ఈ వివాదం తీవ్రమైంది. అకారణంగా తమ పార్టీ వర్గీయుల ఏజెన్సీలను టార్గెట్ చేసి ఎలా మారుస్తారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రశ్నిస్తున్నారు. త్రీమెన్ కమిటీ సభ్యులతో సంతకాలు చేయించి ఏజెన్సీలను తొలగించే ప్రయత్నాలు ఆరంభించారు.. ఆలూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏజెన్సీని మార్చేందుకు యత్నించగా పాత ఏజెన్సీ నిర్వాహ కురాలు సునీత ససేమిరా అనడంతో పాటు కారణం లేకుండా ఎలా తొలగిస్తారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో చేసేదేమి లేక ఇద్దరికీ భోజన ఏజెన్సీ బాధ్యతలు ఇచ్చి ఒక్కో నెలకొకరు భోజనం చేసేలా ఒప్పందం కుదిర్చారు.

ఆలూరు మోడల్ స్కూల్‌లో పోటీపడ్డ రెండు ఏజెన్సీలు

ఆలూరు మోడల్ స్కూల్‌లో ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మి ఏజెన్సీకి బదులు లక్ష్మి పొదుపు సంఘం భోజనం చేసేందుకు ప్రిన్సిపాల్ రాఘవరావు అనుమతి ఇస్తూ బియ్యం కూడా ఇచ్చారు. అయితే భాగ్యలక్ష్మి ఏజెన్సీ నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ మేము వంట చేస్తున్నామని, కారణం లేకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. త్రీమెన్ కమిటీ ఆదేశాల మేరకు ఏజెన్సీను మార్చి వేరే ఏజెన్సీతో మధ్యాహ్న భోజనం చేయిస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పినప్పటికీ అంగీకరించలేదు. ఇంట్లో నుంచి బియ్యం తెచ్చి వంట వండి పిల్లలకు వడ్డించారు. తమకు రావాల్సిన రెండు నెలల బిల్లులు చెల్లించి నాలుగు నెలల వ్యవధి ఇవ్వాలంటూ భాగ్యలక్ష్మి ఏజెన్సీ నిర్వాహకులు అంటున్నారు. త్రీమెన్ కమిటీ ఒక్క రోజు కూడా స్కూల్‌కు వచ్చి భోజన పథకాన్ని పరిశీలించలేదని, అలాంటప్పుడు భోజనం బాగాలేదని ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నిస్తున్నారు. భోజన ఏజెన్సీల మార్పు హెచ్‌ఎంలకు తలనొప్పులు తెచ్చి పెడుతున్నాయి.

మతిస్థిమితంలేని మహిళపై అత్యాచార యత్నం

- గోనెగండ్ల మండలంలో ఘాతుకం...
- కేసు నమోదు చేసిన పోలీసులు

గోనెగండ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో పుట్టకతో రెండు కాళ్లు లేని, మాటలు రాని, చెవులు వినిపించని, మతిస్థిమితం లేని మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచార యత్నం చేశాడు. ఆకలి వేస్తే అన్నం కూడా అడగలేని స్థితిలో ఉన్న మహిళకు ఇంట్లోవారే అన్నం తినిపించాలి. అటువంటి 24ఏళ్ల వయసు ఉన్న మహిళపై అత్యాచార యత్నం జరిగినట్లు ఒక రోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

శుక్రవారం ఈ మహిళ తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. మతిస్థిమితం లేని కూతురుకు అన్నం తినిపించేందుకు చిన్న కూతురును ఇంటి దగ్గర ఉంచారు. ఆ మహిళ ఆరుబయట బాత్‌రూం దగ్గర కూర్చొని ఉండటం చూసిన బోయ రాముడు ఆమెపై అత్యాచార యత్నం చేశాడు. ఆమె అరవడంతో చెల్లెలు బైటికి వచ్చింది. ఈ విషయం ఎవరికైనా చెప్పావంటే చంపేస్తానని ఆమెను బెదిరించి పారిపోయాడు. బాధితురాలి తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

క్లబ్ సంగతేమిటి..?

- ఆలూరు క్లబ్ వ్యవహారంపై ఎస్పీ ఆరా..!

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలూరు కాస్మోపాలిటన్ క్లబ్ వివాదంపై శనివారంపై ఎస్పీ బిందు మాధవ్ ఆరా తీశారు.. క్లబ్ ఎందుకు మూత పడింది. అందులో ఆధిపత్యం కోసం రాజకీయం చేస్తున్నదెవరు? క్లబ్ మూత పడటం వల్ల ఇబ్బంది పడుతున్నదెవరు? క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పదవులు ఆశిస్తున్నది ఎవరు? ఏ నాయ కుడు ఎవరిని ప్రతిపాదిస్తున్నారు? అనే విషయాలపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆలూరు పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు మూతపడిన క్లబ్‌ను తెరిపించాలని క్లబ్ సభ్యులు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరాంను కలిశారు.. దీంతో ఎస్పీకి ఫోన్ చేసిన ఆయన క్లబ్‌లో కేవలం కాలక్షేపం కోసం వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు కూర్చుంటారే తప్ప మద్యం ఎవ్వరూ సేవించరని, క్లబ్ మూత పడటంతో రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆలోచిస్తామని ఎస్పీ చెప్పినట్లు సమాచారం

ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

పాణ్యం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జుర్రాగు సమీపంలో శనివారం జరిగిన దాడి ఘటనలో బీటెక్ పుల్లారెడ్డి, ఆయన కుమారుడు గాయపడినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. కంకర మిషన్ పంచా యితీలో తన గురించి చెడుగా ప్రచారం చేస్తున్నావని తమ్మరాజుపల్లెకు చెందిన పెద్ద షేక్షావలి గత నెల 31వ తేదీన పుల్లారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. పాణ్యం రావాలని పుల్లారెడ్డి చెప్పడంతో పెద్ద షేక్షా వలి, బాలరాజు, షేక్షావలితో పాటు మరి కొందరు శనివారం పాణ్యానికి వచ్చారు. స్థానిక జుర్రాగు వద్ద క్రషర్ గురించి మాట్లాడుతూ మాటమాట పెరిగి ఇరువురి మధ్య వివాదం పెరిగి దాడులకు పాల్పడ డంతో పుల్లారెడ్డికి, కుమారుడు లక్ష్మణ్ శివసాయికి గాయాలైనట్లు తెలిపారు. దాడికి పాల్పడిన పెద్ద షేక్షావలి, బాలరాజు, షేక్షావలితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులకు కంప్యూటర్ బిల్లు ఇవ్వాలి

- పేపర్లపై రాసి ఇస్తే చర్యలు
- సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి హెచ్చరిక


మాట్లాడుతున్న సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులను కొనుగోలు చేసిన తర్వాత రైతులకు కంప్యూటర్ బిల్లు ఇవ్వాలని, కాగితాలపై రాసి ఇస్తే చర్యలు తీసుకుంటామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి వ్యాపారులను, కమీషన్ ఏజెంట్లను హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్‌తో పాటు సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితరులతో కలిసి అత్యవసర సమావే శాన్ని నిర్వహించారు. ఈనామ్‌లో సర్వర్ సమస్య పరిష్కారమైనందున ఇకపై ఎటువంటి ఆటంకాలు లేకుండా రైతులు తెచ్చే పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు దృష్టి పెట్టాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆదేశించారు. ఎలక్ట్రానిక్ కాటాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని, తూకాల సమయంలో అదనపు సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు తప్పనిసరిగా కాటాల వద్ద తూకాలు ఏ విధంగా వేస్తున్నారో పరిశీలించాలని ఆదేశించారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే విచారణ జరిపి బాధ్యులైన కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తెచ్చే పంట ఉత్పత్తులు కొనుగోళ్ల తదితర వివరాలను సక్రమంగా కంప్యూటర్ పేపరులో నమోదు చేయిస్తున్నామని, కమిషన్ ఏజెంట్లు వాటినే రైతులకు అందజేయాలని ఆదేశించారు. చిత్తు కాగితాలపై రాసి ఇస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు తప్పనిసరిగా పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేయించి కర్నూలు యార్డుకు తీసుకురావాలని, ఈ విషయంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం

● ఆత్మకూరులో సువిశాలమైన రోడ్లను తీర్చిదిద్దేలా మున్సిపల్‌శాఖ కసరత్తు
● ఇప్పటికే ప్రధాన రహదారుల వెంట ఆక్రమణల తొలగింపు
● పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టి
● కేజీ రోడ్డుపై జిగేల్ మనిపించేలా ఎల్ఈడీ దీపకాంతులు

ఆత్మకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దేందుకు మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం గత కొన్నిరోజులుగా పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగించే పనిలో పడ్డారు. ఇప్పటికే పట్టణంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి, పాతబస్టాండ్, కప్పలకుంట, నేతాజీనగర్, తహసీల్దార్ కార్యాలయం రస్తా, పోస్టాఫీసు ఏరియా తదితర రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నారు. ఇందుకోసం సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి నిర్ణయించిన గడువులోగా వాటిని తొలగించకపోతే మున్సిపల్ అధికారులే నేరుగా రంగంలోకి దిగి ఆక్రమణల తొలగింపు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే పట్టణంలోని గౌడ్‌సెంటర్ నుంచి పాతబస్టాండ్ వరకు ఉన్న రోడ్డుపై పూర్తిస్థాయిలో ఆక్రమణలను తొలగించి అందుబాటులోకి తీసు కొచ్చారు. నిత్యం రద్దీతో ఉండే కప్పలకుంటలో దుకాణాదారులు ఆక్రమించి నిర్మించిన మెట్ల నిర్మాణాలను, షాపుల ముందు ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లను తొలగించడంతో ఆ రహదారి సైతం సువిశాలంగా మారింది. అలాగే ప్రస్తుతం పట్టణంలోని నేతాజీనగర్‌లో ఆక్రమణల తొలగింపు పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. మొత్తం మీద పట్టణంలో రద్దీగా కనిపించే అన్ని రహదారులను గుర్తించి వాటి వెంట ఉన్న ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. అంతేకాకుండా రోడ్లపై అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను సైతం తొలగించి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఇదిలావుంటే ఆక్రమణల తొలగింపుపై ప్రజల్లో కూడా సానుకూలమైన స్పందన కనిపిస్తోంది. ఇంతకాలం ఎదుర్కొన్న ట్రాఫిక్ ఇబ్బందులు రోడ్ల విస్తరణ వల్ల పరిష్కారం కానుండటంతో వారు సైతం మున్సిపల్ అధికారులకు సహకరిస్తున్నారు.


ఆత్మకూరులోని పాతబస్టాండ్ రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)


కేజీ రోడ్డుపై అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

ప్రజలకు సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

ఆత్మకూరు పట్టణంలో ప్రజలకు సౌకర్యవంతమైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇప్పటికే పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించే పనులు చేపడుతున్నాం. ఇందుకోసం ముందుగానే నోటీసులు జారీ చేస్తున్నాము. రోడ్లు సువిశాలంగా ఉన్నప్పుడు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రజలు సౌకర్యవం తంగా ఉంటారు. అదేవిధంగా పట్టణ సుందరీకరణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తాం. అదనపు నిధులు రాగానే ఆ పనులను కూడా మొదలు పెడతాం. మున్సి పాలిటీ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి.



- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

పట్టణ సుందరీకరణకు కసరత్తు



గతంలో ఎక్కడ చూసినా చెత్త దిబ్బలతో కనిపించే ఆత్మకూరు పట్టణాన్ని సుందరీక రించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికే పట్టణంలోని కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై ఉన్న బట్టర్‌ఫ్లై విద్యుత్ స్తంభాలకు రంగురంగులతో కూడిన రోప్‌లైట్లను అమర్చడంతో కేజీరోడ్డు జిగేల్ మనిపించేలా కనిపిస్తోంది. అంతేకాదు గతంలో చక్రం హోటల్ సమీపంలో కేజీ రోడ్డు డివైడర్ ప్రారంభయ్యే ప్రాంతంలో అనేకమార్లు వాహనాలు డివైడర్‌ను ఢీకొని ప్రమాదాలు జరిగేవి అయితే ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను కూడా నివారించేందుకు అవకాశం ఉంది. ఇవేకాకుండా పట్టణంలో డివైడర్‌ను సుందరీకరించడంతో పాటు ప్రభుత్వ భవనాల గోడలపై కూడా సుందరమైన చిత్రాలను గీయించే ఆలోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. నిధులు మంజూరు కాగానే ఈ పనులను వేగవంతం చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

మహానందిలో ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు


దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

మహానంది, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని వేలాదిమంది భక్తులు మహానంది క్షేత్రాన్ని సందర్శించారు. శనివారం వేకువజామునవే ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంటల కొద్ది క్యూలో నిల్చొని ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కాగా ఆదివారం, కార్తీక మొదటి సోమవారాల్లో కూడ మహానందిలో భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉంది. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఏఈవో మధు తెలిపారు.

సంగమేశ్వరంలో శివుడికి మంగళ హారతి


శివుడికి మహా మంగళ హారతులు ఇస్తున్న అయ్యప్ప భక్తులు

కొత్తపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం కార్తీక మాసం పూజలు ప్రారంభమయ్యాయి. మండలంలోని సప్తనది సంగమతీరంలో ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు చేశారు. లలితాదేవి అమ్మ వారి ముందు ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకాశదీపోత్సవం నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని, అక్కడే ఉన్న శివలింగానికి పూజలు చేసి దీపాలు వెలిగించి మహా మంగళ హారతులు ఇచ్చారు.

దుర్గా భోగేశ్వరంలో ఆకాశ దీపోత్సవం

గడివేముల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో శనివారం కార్తీక మాసోత్సవాలు ప్రారంభించారు. దుర్గా భోగేశ్వర ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ ఈవో రామానుజన్, ప్రధాన అర్చకుడు శ్యామ్‌సుందర్ శర్మ ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగించారు. నవంబరు 15న వైభవంగా స్వామి కల్యాణం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.


ఆకాశ దీపోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు →

రైతు సంఘం అధ్యక్షుడిగా సూర్యనారాయణ


వేల్పనూరులో ఎమ్మెల్యేను కలిసిన రైతు సంఘం నాయకులు

వెలుగోడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణ రైతు సంఘం అధ్యక్షుడిగా సూర్యనారాయణను రైతులు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శనివారం రైతు సంఘం నాయకులు వేల్పనూరుకు చేరుకొని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని సన్మానించారు. రైతుసంఘం ఉపాధ్యక్షు డిగా రెహమాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ నాయకులు ఎల్లాల కృష్ణుడు, రెహమాన్, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

త్రో బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ప్రముఖులు

నంద్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల క్రీడా మైదానంలో 8వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ జిల్లా స్థాయి బాల, బాలికల త్రో బాల్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి అధ్యక్షతన ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, నంద్యాల క్రీడా సమాఖ్య అధ్యక్షుడు డా.రవికృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ బేగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శివకుమార్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా ప్రమోటింగ్ గవర్నర్ గౌతం, ఎస్డీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొండారెడ్డి, గురురాజా డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి హాజరయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు, జట్ల కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా

మహానంది, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బుక్కాపురం సమీపంలో శనివారం అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ప్రధాన రహదారి నుంచి ఒక వెంచర్‌కు మట్టిని తరలిస్తున్న టిప్పర్ వేగంగా వస్తూ అదుపుతప్పి ప్రమాదవశాత్తు రహదారి పక్కనే ఉన్న వరి పంట పొలంలో బోల్తా పడింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జూపాడుబంగ్లా, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అండర్ -19 బాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో స్కూల్‌గేమ్స్‌లో జూపాడు బంగ్లా ఆదర్శ పాఠశాల ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సానియామీర్జా, ఫాతిమాబీ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో శనివారం పాఠశాలలో అభినం దించారు. ఈనెల 8న కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యా యిని పద్మమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరాళంగా పచ్చళ్లు

శ్రీశైలం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇబ్రహీంపట్నానికి చెందిన ఎన్. సత్యనారాయణ బెంగళూరుకు చెందిన సుదర్శన్, పి.చైతన్య రెండు వేల కేజీల మామిడికాయ, నిమ్మకాయ పచ్చళ్లను దేవస్థానం ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖరరెడ్డికి అందజేశారు. ఈ పచ్చళ్ల విలువ సుమారు రూ.3 లక్షల దాకా ఉంటుందని తెలిపారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతాం: మంత్రి

నంద్యాల కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రోడ్లను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల సంజీవనగర్ గేటు వద్ద మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం కింద మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి గుంతలు లేని రోడ్ల పనులను ప్రారంభించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల సంజీవనగర్ గేటు నుండిశ్రీనివాసనగర్ జంక్షన్ వరకు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో గుంతలు పూడ్చేం దుకు ప్రభుత్వం రూ. 4.57 కోట్లు మొదటి విడతగా మంజూరు చేసిం దని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 15లోపు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయనున్నట్లు మంత్రి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 369 కిలో మీటర్ల రహదారిని సంక్రాంతి పండుగలోపు రహదారుల్లోని అన్ని గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మంజూరులు వస్తాయన్నారు. దీంతో పాటు పంచాయతీ రాజ్, మున్సిపల్ రోడ్ల పనులు కూడా మంజూరు కావాల్సి ఉందన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, ఇంజనీరింగ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


నంద్యాలలో 'గుంతల రహిత ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి


అల్లూరు వద్ద ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్: గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామం బీటీ రహదారిలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం చేపట్టింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయసూర్య హాజరై పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని గుంతలమయం చేసిందన్నారు. దీనికి సాక్ష్యం ప్రస్తుత ప్రభుత్వం పూడ్చుతున్న గుంతలే అని అన్నారు. గ్రామీణ రహదారులు మరీ అధ్వానంగా తయారయ్యాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో పుష్కరాలకు వేసిన రోడ్లు 12 సంవత్సరాలు అయినా వాటివైపు వైసీపీ ప్రభుత్వం కన్నెత్తి చూడలేదన్నారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, ఏఈ మనోహర్, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, అల్లూరు గ్రామ సర్పంచ్ చిన్ననాగ లక్ష్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీప్రాంత పరిధిలోని చెంచు గూడెంలలో మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు పకడ్బందీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో చెంచుల జీవన ప్రమాణాల సర్వేపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14 మండలాల్లోని 48చెంచు గూడెంలలో 2095 కుటుంబాల్లో దాదాపు 8వేల మంది చెంచులు జీవనం కొనసాగిస్తున్నారని, వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు పకడ్బందీ సర్వే నిర్వహించి సమగ్రవివరాలు సేకరించాలని ఉద్యోగులను ఆదేశించారు. గూడేల్లో పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యాలు, టాయిలెట్లు తదితర కనీస అవసరాలు, ప్రత్యేకించి రేషన్‌కార్డు, ఆధార్, ఆరోగ్య, కుల ధ్రువీకరణ తదితరాలతో పాటు జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏఏ చర్యలు చేపట్టాలి అనే అంశాలపై సమగ్ర వివరాలు 32 కాలమ్‌లతో కూడిన ప్రొఫార్మా అందజేస్తున్నామన్నారు. సచివాల సిబ్బంది ఐదుగురు గ్రూపుగా వెళ్లి పైలెట్ సర్వే నిర్వహించాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివప్రసాద్, డీపీవో జమీవుల్లా, ఆత్మకూరు డీఎల్‌డీవో సూర్యనారాయణ, నంద్యాల డీఎల్‌డీవో శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ సభలు

గోస్పాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన గ్రామ సభలు శనివారం ముగిశాయి. తేళ్లపురి గ్రామంలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి అధ్యక్షత వహించారు. తహసీల్దారు షేక్‌మొహిద్దీన్, డీటీ హరిత, టీడీపీ కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, సర్వేయర్ ఉమా మహేశ్వరరావు, ఆర్ఐ చంద్రమోహన్‌రెడ్డి, వీఆర్వో దస్తగిరి, పాల్గొన్నారు.

'ఓటరుగా నమోదు చేసుకోవాలి'

నందికొట్కూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నందికొట్కూరు మండల తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కలేజీలో నీ ఓటు.నీ భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కు నమోదు, ఓటు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ మధు సుధాకర్, బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ ఏలీషా బాబు, తహసీల్దార్ సిబ్బంది కళావతి, ఎలక్షన్ సెల్ ఆపరేటర్లు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ కాలనీలోకి వర్షపు నీరు రాకుండా చూడాలి'

మహానంది, నవంబరు 2 ఆంధ్రజ్యోతి): మసీదుపురంలోని ఎస్సీ కాలనీలో వర్షపునీరుతో పాటు తెలుగుంగ ప్రధాన కాల్వ సబ్ చానల్ నుంచి వచ్చే నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ నాయకుడు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. శనివారం గ్రామంలోని ఎస్సీ కాలనీని సందర్శించిన తహసీల్దార్ రమాదేవితో పాటు ఎంపీడీవో మహమ్మద్ దౌలాను ఆయన కలిశారు. ఈవోఆర్డీ నాగేంద్రుడు, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

అలరించిన నిత్య కళారాధన

శ్రీశైలం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం రాజమండ్రికి చెందిన శామ్‌నృత్యనికేతన్ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, నమఃశివాయతే, భో శంభో, శివతాండవం గీతాలకు వేదశ్రీ, ప్రదీప్ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. తరువాతి కార్యక్రమంలో రాజమండ్రికి చెందిన సత్య శ్రావణి నృత్య నికేతన్ బృందంచే యోగీశ్వరాయ హర హర శంకరా, వినాయకౌత్వం, లింగాష్టకం, తదితర గీతాలకు కె. శామ్, ఆర్.భార్గవి తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

కర్ణాటక పీసీసీఎఫ్ పూజలు

మహానంది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కర్ణాటక పీసీసీఎఫ్ మనోజ్ శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ముఖమంటపం వద్ద వీరికి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో పీసీసీఎఫ్ స్వామి,అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం కల్యాణమంటపంలో వీరిని వేదపండితులు రవిశంకర్ అవధాని శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. నంద్యాల ఆర్డీవో విశ్వనాథం దంపతులు కార్తీకమాసం పురస్కరించుకొని మహానందిలో ప్రత్యేక పూజలు జరిపారు. వీరివెంట తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి'

నంద్యాల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిబాబు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. హరి బాబును మంత్రి ఫరూక్ అభినందించారు.


శాశ్వత సభ్యత్వం స్వీకరిస్తున్న హరిబాబు

వైద్య శిబిరం

ఆత్మకూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముష్టపల్లి గ్రామంలో బైర్లూటి పీహెచ్‌సీ, 104 సిబ్బందితో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, పలు చిరు వ్యాధులకు చికిత్సలు అందించారు. అనంతరం పొగాకు వాడకం ద్వారా వచ్చే వ్యాధులు, లక్షణాలు, చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి పవన్‌కుమార్, సీహెచ్‌వో అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు ఇందిర, విశ్వనాధ్, రవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చి సోలార్ ఏర్పాటు చేసుకోవాలి

● ఆర్డీవోను కలిసిన పైపాలెం గ్రామస్థులు

మిడుతూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డిమాండ్లను నెరవేర్చిన తర్వాత సోలార్ ఏర్పాటు చేసుకోవాలని పైపాలెం గ్రామస్థులు అన్నారు. నాగలూటి, పైపాలెం గ్రామాలను ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి శనివారం సందర్శించారు. మొదటగా సోలార్‌కు ఇచ్చిన ల్యాండ్ రికార్డులను ఆర్డీవో నాగలూటి గ్రామ సచివాలయంలో పరిశీలించారు. సోలార్‌కు అప్పగించిన నాగలూటి, పైపాలెం, మాసపేట గ్రామాలకు చెందిన ల్యాండ్ వివరాలను తహసీల్దార్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. పైపాలెం గ్రామస్థులు నాగలూటి సచివాలయం వద్ద చేరుకొని తమ గ్రామానికి న్యాయం చేయాలని ఆర్డీవోను వేడుకున్నారు. ఆర్డీవో స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం పైపాలెం గ్రామంలోని సోలార్‌కు ఇచ్చిన ల్యాండును ఆర్డీవో పరిశీలించారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఉమాపతి, డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, సర్వేయర్ కృష్ణుడు, వీఆర్వో సుందర్ రాజ్, సచివాలయ సిబ్బంది, పైపాలెం సర్పంచ్ రామచంద్రుడు, జగన్‌మోహన్ రెడ్డి, ఇనాయతుల్ల, వెంకటేశ్వర్లు, రామేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.


పైపాలెంలో సోలార్‌కు ఇచ్చిన భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో

'ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే భూములు కేటాయించాలి'

పైపాలెం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ తీసుకున్న తరువాతనే సోలార్‌కు భూములు కేటాయించాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురాం, రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్డీవో నాగజ్యోతికి వినతి పత్రం అందించారు. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండు చేశారు. పైపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

డోన్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ పి.శ్రీనివాసులు అన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐలు గోపాల్, శ్రీరాములు, కానిస్టేబుళ్లు రవి, ప్రకాష్‌తోపాటు హోంగార్డులకు డీఎస్పీ రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

అవుకు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో మదర్‌మోడల్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనపరచినట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్సింగ్ పోటీల్లో జాహ్నవి, కరిష్మా వెండి పతకాలు, నవ్య, మహిత, సాయిశ్రీ, చైతన్యలక్ష్మి కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామసుబ్బమ్మ, బాక్సింగ్ కోచ్ చంద్రమౌళి, కోఆర్డినేటర్ సాయిక్రిష్ణవేణి, ప్రధానోపాధ్యాయుడు మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి సురక్షితం

కోవెలకుంట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుందూనదిలో గల్లంతైన వ్యక్తి సురక్షితంగా బయట పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మండలంలోని లింగాల గ్రామానికి చెందిన బీమిరెడ్డి రామక్రిష్ణరెడ్డి అనే రైతు తన భార్యతో కలిసి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి కుందూ నదిలో కాలు జారి పడిపోయి కొట్టుకుపోయాడు. భార్య గ్రహించి విషయాన్ని గ్రామస్థులకు, పోలీసులకు తెలిపింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ భూపాలుడు సిబ్బందితో కలిసి నది వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. కుందూలో కొట్టుకుపోతున్న రామక్రిష్ణరెడ్డి కొద్దిదూరం వెళ్లి గడ్డకు ఆనుకుని ఉన్న చిన్నపాటి చెట్టును పట్టుకుని రక్షించాలని కేకలు పెట్టాడు. పోలీసులు కుందూ వెంట గాలింపు చర్యలు చేపట్టగా ఆయన కేకలు విని అక్కడికి వెళ్లి సురక్షితంగా బయటికి తీశారు. దీంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం

చాగలమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మాలధారులకు శనివారం దాతల సహకారంతో అన్నదానం ప్రారంభించారు. అంతక ముందు అయ్యప్ప చిత్రపటంతో పురవీధుల గుండా గ్రామోత్సవం చేశారు. అనంతరం ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దాతలను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సుంకు జనార్దన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

అపార్‌పై అవగాహన

చాగలమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యార్థులకు అపార్ నమోదుపై ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థుల ఆధార్ నమోదు ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పాఠశాల రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్మిత, సీఆర్పీ అమీర్ ఖాన్ పాల్గొన్నారు.

శిథిలమైన ఎస్సార్బీసీ భవనాలు

● బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ
● నివాస యోగ్యం లేక ఇబ్బందుల్లో ఉద్యోగులు

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణ శివారులో నిర్మించిన ఎస్సార్బీసీ భవనాలు, కార్యాలయాలు శిథిలమయ్యాయి. దాంతో బిక్కుబిక్కుమంటూ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లకు నిధులు మంజూరు చేయాలని అనేక సార్లు ఎస్సార్బీసీ అధికారులకు ప్రతిపాదనలు పంపుతు న్నా నిధులు మంజూరు కావడం లేదు.

ముళ్లపొదల మధ్యలో భవనాలు

1986లో ఎస్సార్బీసీ కాలువ నిర్మాణంలో భాగంగా ఎస్సార్బీసీలో పనిచేసే ఉద్యోగులు నివసించేందుకు, వారి కార్యాలయాల నిర్మాణానికి సుమారు 20 ఎకరాల్లో భవనాలు, కార్యాలయాలు నిర్మించారు. అయితే ఈ భవనాలను, కార్యాలయాలను నాసిరకంగా నిర్మించారు. దీంతో ఎస్సార్బీసీ క్వార్టర్లలో ఏనాడు ఉద్యోగులు నివసించిన దాఖలాలు లేవు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారే గానీ భవనాలు నిర్మించినప్పట్నుంచి ఎవరూ ఉండడానికి ఇష్టపడకపోవడంతో పూర్తి శిథిలావస్థకు చేరుకున్నాయి. క్వార్టర్లు, కార్యాలయాలు పిచ్చి మొక్కలు, ముళ్ల పొదల తో నిండిపో యాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకును ఉపయోగించిన దాఖలాలు లేవు. ట్యాంకు పరిసర ప్రాంతాలు కూడా ముళ్లమయంగా మారాయి. క్వార్టర్లు ముళ్ల పొద లుగా నిండి పోవ డంతో పాములు, ఇతర విష పురుగులకు నిలయంగా మారిపోయింది.



శిథిలమైన ఎస్సార్బీసీ భవనం



ఎస్సార్బీసీ కాలనీ

ఆందోళనలో ఉద్యోగులు

ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన కార్యాలయ భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. నేడో, రేపో కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. సుమారు 100 మంది ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈఈలు, డీఈఏలు, జేఈలు, సూపరింటెండెంట్‌లు, ఇతర సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలోని ప్రతి గది పూర్తిగా కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీనికి తోడు కార్యాలయాల్లోకి విషసర్పాలు కూడా ప్రవేశిస్తుండడంతో బిక్కుబిక్కుగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలోని రికార్డులు తడిసి ముద్దయిపోతున్నాయి. అయినా తప్పని పరిస్థితుల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. క్వార్టర్లు శిథిలావస్థకు చేరడంతో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో కార్యాలయ భవన నిర్మాణాలకు రూ.కోటితో ప్రతిపాదనలు పంపారు. కాని ఒక్క నయాపైసా నిధులు విడుదల కాలేదు.

వాల్మీకుల అభివృద్ధికి టీడీపీ అండ

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల అభివృద్ధికి టీడీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వాల్మీకి గుహల దగ్గర కర్ణాటక వాల్మీకి పీఠం ప్రసన్నానందపురి మహాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ తన తండ్రి దివంగ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. తాము కూడా తన తండ్రి బాటలోనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు బోయవాండ్లపల్లి కంబయ్య, లింగన్న, మెట్టుపల్లి సుదర్శన్, దామోదర్‌నాయుడు, కంబగిరిస్వామి, రంగస్వామి, రంగస్వామి, జయరాముడు, లక్ష్మీరంగయ్య, శ్రీరాములు, నాగేశ్వరరావు, కుమార్‌రాముడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన నాయకులు

డోన్ రూరల్: డోన్ నియోజకవర్గంలోని బోయవాండ్లపల్లె వద్ద వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వైద్యఆరోగ్య సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు డోన్ బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి , నియోజకవర్గ కన్వీనర్ సంధు రమణ, రవికుమార్, రాజశేఖర్, దామోదర్ నాయుడు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే టీడీపీ ధ్యేయం

బేతంచెర్ల : రాష్ట్రంలోని మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతూ మహిళా అభివృద్ధే టీడీపీ ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీడీవో ఫజల్ రెహమాన్ అధ్యక్షతన ప్రభుత్వం దీపం-2 కార్యక్రమం కింద 33 మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు, టీడీసీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, ఉన్నం చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, భీమేశ్వర్ రెడ్డి, మేకల నాగరాజు, రూబెన్, నగర కమిషనర్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, సీఐ వెంకటేశ్వరరావు, భారగ్ గ్యాస్ డీలర్ రమణారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి

ప్రతి పల్లెకు రవాణా సౌకర్యం

డోన్: ప్రతి పల్లెకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించి ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు పరుస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కనపకుంట గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోట్ల భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, దేవరబండ వెంకటనారాయణ, ప్రభాకర్ రెడ్డి, రంజిత్ కిరణ్, తాడూరు వెంకటరమణయ్య, గోవిందరెడ్డి, మధుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

చౌక దుకాణాలను బలోపేతం చేస్తాం: మూలే

కొలిమిగుండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో నిర్వీర్యమైన చౌకదుకాణాలను టీడీపీ కూటమి ప్రభుత్వం మరిన్ని సరుకులను అందించి పూర్తి స్థాయిలో బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కొలిమిగుండలో నూతన చౌక దుకాణాన్ని మూలే రామేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు పేట్నీకోట హుస్సేన్‌రెడ్డి, ఉలువల నరసింహుడు, ప్రసాదు, గుడూరు బ్రదర్స్, కోటపాడు శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ పెద్ద నాగయ్య, గూలి నాగేశ్వరరెడ్డి, చంద్ర, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు రేషన్ అందిస్తున్న మూలే రామేశ్వరరెడ్డి

వైద్య సేవలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు: డీఎంహెచ్‌వో

ప్యాపిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. 24గంటలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేసుకొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే 104 వైద్య సేవలు గ్రామీణులకు క్రమం తప్పకుండా అందించాలని ఆయన సూచించారు. అనంతరం అధికారి పట్టణంలోని పలు ఆర్ఎంపీ కేంద్రాలను తనిఖీ చేశారు. పరిమితికి మించి వైద్యం చేస్తే శాఖపరమైన కేసులు నమోదు చేస్తామని ఆర్ఎంపీలను హెచ్చరించారు. ఆర్ఎంపీ క్లీనిక్‌లపై మరింత సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆయన స్థానిక వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వాణిశ్రీ, నితీష్, రాఘవేంద్రగౌడు, గంగాదేవి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకుడితోనే అభివృద్ధి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : సమర్థవంతమైన నాయకుడితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ(గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంలో భాగంగా చింతకుంట్ల గ్రామ పరిధిలోని ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతు పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రూ.84 లక్షలతో 65 కి.మీ మేర దెబ్బతిన్న రహదారుల్లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సుబ్బరాయుడు, ఏఈ దస్తగిరి, కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు జాఫర్‌రెడ్డి, సిద్ధి సత్యం, హర్ష, నాయుడు, సుబ్బరాయుడు, అమర్‌సింహారెడ్డి పాల్గొన్నారు.



చింతకుంట్ల రహదారిలో పనులు ప్రారంభిస్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

మహిళల సంక్షేమానికి పెద్దపీట

● రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంఎస్ ఆర్ కార్యాలయంలో సుబ్బారెడ్డిని రిటైర్డు సీఎస్‌సీవో వెంకట్రామిరెడ్డి, జిల్లా సీడ్ మెన్ అసోసియేషన్ నాయకులు వెంకటరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, మద్దిలేటి, రమణయ్య మర్యాద పూర్వకంగా కలిసి స న్మానించారు.



సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



ముత్యాలపాడులో శరభేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో శనివారం కార్తీక మాస మహో త్సవాలు పారంభం అయ్యాయి. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యాగంటి అలయ ఈవో చంద్రుడు శనివారం తెలిపారు. ఈవో మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో ఉత్సవాలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకొని శనివారం నుంచి డిసెంబరు 1 వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులకు ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ, ఉమామహేశ్వర రెడ్డి అన్నదాన సంస్థ, శ్రీ ఉమామహేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ, తదితర సంస్థలు భక్తులకు ఉచితంగా కార్తీక మాసంలో భోజన సౌకర్యం కల్పించ నున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమా లు, నిత్యం అభిషేకాలు, అర్చన కార్యక్ర మా లు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

చాగలమర్రి/రుద్రవరం: మండలాల్లోని భైరవీశ్వర, శరబేశ్వర, రామలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర, గృహమద్దిలేటిస్వామి, రుద్రవరం ఆలయాల్లో శనివారం ఓంకార నాదాలతో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చాగలమర్రి పాత శివాలయంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్తీకపౌర్ణమి దీపాన్ని వెలిగింప చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు, పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం కార్తీకమాస పూజలను ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ఉపవాసాలు ఉండి శివపార్వ తులను ఆరాధిస్తే సకాల శుభాలు కలుగుతాయని భక్తులు నమ్మకం వ్యక్తం చేశారు.

కొలిమిగుండ్ల : మండలంలోని ప్రముఖ ఆలయాలైన గుండుమల్లేశ్వరస్వామి, లలితా సుందరేశ్వరస్వామి, బెలుం సిద్ద రామేశ్వరస్వామి, నేలబిళం మల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో కార్తీక మాసం పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించుకొని విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

నేడు వాలీబాల్ పోటీలు

చాగలమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడులో మార్తోమా గుడి ప్రతిష్ఠను పురస్కరించుకొని నేడు, రేపు రెండు రోజుల పాటు ఓపెన్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాముడు శనివారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7,500, మూడో బహుమతి రూ.5 వేలు నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీల్లో పాల్గొనాలని అన్నారు.

6న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లలిత, జేకెసీ సమన్వయ కర్త సీతమ్మ శనివారం తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, ఆక్సిస్ బ్యాంకు(ఐటీఎం), టీవీఎస్‌సుందరం ఫాస్టెనర్స్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాలు ఉన్నట్లు తెలిపారు. ఆయా కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటారన్నారు. డిగ్రీ చదివిన చదువుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మురుగు కాల్వల్లో చెత్త తొలగింపు

రుద్రవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామంలో మురుగు కాల్వల్లో శనివారం చెత్తను తొలగించారు. పనులను ఈవో సుబ్బారావు పరిశీలించారు. ఇటీవల రుద్రవరంలో డయేరియా కేసులు నమోదైన విషయం విదితమే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మురికికాల్వలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పారిశుధ్యం లోపించకుండా సహకరించాలని ఈవో కోరారు.

ముగిసిన ధార్మిక ప్రవచనాలు

దొర్నిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగ్యనగరం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో రామాలయం ఆలయంలో నిర్వహించిన ధార్మిక ప్రవచనాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా భజన భక్తి మండలిచే భజన గీతాలు, కుంకుమార్చన, గోపూజ తదితర కార్యక్రమాలు టీటీడీ ధర్మప్రచారకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ధర్మప్రచార సభ్యులు వీరాంజనేయులు, ఆలయ ధర్మకర్త వీరగంధం బ్రహ్మయ్య, అర్చకులు నరసింహా, ప్రసాద్‌శర్మ, గోపాలకృష్ణయ్య, వేణుగోపాల్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, పుల్లయ్య నాయుడు, సీతమ్మ, భాగ్యమ్మ, ఉమా, పార్వతి, మహిళలు ఉన్నారు.

మృతదేహాన్ని గుర్తించిన బంధువులు

రుద్రవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం పోలీసుస్టేషన్ పరిధిలో తుండ్లవాగు రిజర్వాయరులో లభించిన మృతదేహాన్ని బంధువులు గుర్తించినట్లు శనివారం ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఆదయ్య (78) అనే వ్యక్తిగా బంధువులు గుర్తించారన్నారు. మృతుడు తమ కుమార్తె ఉన్న పోరుమామిళ్ల వెళ్లి వస్తానని అక్టోబరు 25న వెళ్లాడన్నారు. తిరిగి రాకపోవడంతో బంధువులున్న గ్రామాల్లో గాలింపు చేపట్టినా ఫలితం లేదన్నారు. బంధువు ల ద్వారా సమాచారం అందుకుని వచ్చి మృతదేహాన్ని పరిశీలిస్తే తమ తండ్రిదిగా కుమారుడు గుర్తించాడు. మృతుడి కుమారుడు వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు బనగానపల్లె, అవుకు మండలాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి శనివారం తెలిపారు. టాటా విండ్ పవర్, ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో 12 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనగా సైన్సు నమూనాలు, క్విజ్, పోస్టర్ మేకింగ్ విభాగాల్లో బనగానపల్లె, అవుకు మండలాల్లో గల గుండ్లశింగవరం ఉన్నతపాఠశాల, వేములపాడు యూపీ పాఠశాల, బనగానపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠ శాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. క్విజ్ పోటీల్లో బద్రీనాథ్, పోస్టర్ మేకింగ్‌లో మహేశ్వరరెడ్డి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని హెచ్ఎం రామకృష్ణ, గుండ్లశింగవరం హెచ్ఎం ఐజయ్య, బాలుర ఉన్నతపాఠశాల ఇంచార్జి హెచ్ఎం నాగరాజు అభినందించారు.

వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, సోషల్‌మీడియా ద్వారా పరిచయమైన వ్యక్తులతో విద్యార్థినులు, మహిళలు తమ వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరాముడు సూచించారు. ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని పడకండ్ల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి, ఎస్ఐలు జయప్ప, నగీనా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కొలిమిగుండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పలు వాహనాలను తనిఖీ నిర్వహించి, పత్రాలు సరిగ్గాలేని పలు వాహనాలకు సీఐ జరిమానా విధించినట్లు తెలిపారు.